
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

ఆదివారం 14 ఏప్రిల్ 2024



రేపు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశం

● హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13 : ఈ నెల 15న మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బూత్ కమిటీలు, ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 10గంటలకు జరిగే ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.



మాట్లాడుతున్న రవి

ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

» టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13 : ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఇబ్రహీంపట్నంలో టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. యూటీఎఫ్ పోరాటం ఫలితంగానే స్పెషల్ విద్యావాలంటీర్లను ఉపాధ్యాయులుగా గుర్తించారని ఆయన అన్నారు. సీపీఎస్ రద్దు చేసేవరకూ ఉపాధ్యాయులంతా కలిసి రావాలన్నారు. ఉపాధ్యాయుల కుటుంబాల సంక్షేమం కోసం ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ అనే సంస్థను ఏర్పాటు చేసి.. ప్రాణాలు కోల్పోయిన ఉపాధ్యాయ కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ప్రత్యేక అనుమతితో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాలయ్య, నాయకులు సుగంధ, కిషన్ చౌహాన్, రామకృష్ణ, జగన్నాథశర్మ, నాగేంద్రం, అర్జున్ రెడ్డి, కల్పన, రవి తదితరులు పాల్గొన్నారు.



తోపుడు బండి నీడలో సేదదీరి...

బతుకు పోరులో అలసిపోయిన ఓ బాటసారి రోడ్డు పక్కన తోపుడు బండి నీడలో విశ్రమించాడు. ఎర్రటి ఎండలో ఆ బండి నీడే అతడికి పచ్చని చెట్టయింది. షాద్‌నగర్‌లోని కేశంపేట రోడ్డులో శనివారం మధ్యాహ్నం ఎండకు తాళలేక, ముందుకు వెళ్లలేక ఓ బాటసారి తోపుడు బండి వద్ద ఉన్న కొద్దిపాటి నీడలో కునుకు తీశాడిలా!

- షాద్‌నగర్, ఏప్రిల్ 13

ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్

చేవెళ్లలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. ఈ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరైన ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈసభకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి భారీగా జనాలు తరలివచ్చారు. సభలో కేసీఆర్ మాటల తూటాలతో ఇటు ఓటర్లలో అటు బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు. కేసీఆర్ ప్రసంగం మధ్యలో ఈలలు, చప్పట్లు, కేరింతలు, జైతెలంగాణ.. జైజై తెలంగాణ అంటూ నినాదాలతో సభా ప్రాంగణంలో హోరెత్తింది. కాంగ్రెస్‌ప్రభుత్వంతో పాటు బీజేపీ వైఫల్యాలను ఆయన ప్రజలకు వివరించారు.

చేవెళ్ల మేధావుల్లారా.. ఆలోచించి ఓటెయ్యండి



బహిరంగ సభకు తరలివచ్చిన జనం

» షాబాద్ ప్రాంతంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేశాం
» రంజిత్‌రెడ్డి ఏమైనా పొద్దుతిరుగుడు పువ్వా..!
» రియల్ ఎస్టేట్ ఎందుకు పడిపోయింది?
» ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

బీసీలకు దమ్ముంటే కాసానిని గెలిపించండి

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల/మొయినాబాద్/షాబాద్ : చేవెళ్ల మేధావుల్లారా.. ఒక్కసారి ఆలోచించి ఓటేయ్యండని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కేసీఆర్ అన్నారు. కాసాని జడ్పీ చైర్మన్‌గా ఉమ్మడి జిల్లాకు సేవలందించారని, పాలనపై పట్టు, అనుభవం ఉన్న వ్యక్తి అన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకు వచ్చారని, బీసీలకు దమ్ముంటే కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు బీసీలకు మలుపు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. షాబాద్ మండలం చందనవెల్లిలో వెల్స్పన్, కుందన్, కటేరా, అమేజాన్, సీతారాంపురంలో ఎలక్ట్రానిక్ బస్సులు, శంకర్‌పల్లి మండలం కొండకల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు వంటి పెద్దపెద్ద కంపెనీలను తీసుకువచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉద్దండాపూర్ నుంచి చేవెళ్ల వరకు సాగు, తాగునీటి పనులకు కొనసాగించామని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుందని ఆయన ఆరోపించారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలో బోరుబావుల కింద వరి పంట అధికంగా సాగు చేశారని, ధాన్యం అధికంగా వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో వేయడం జరిగిందని చెప్పారు. బీజేపీ సర్కార్ రంగారెడ్డి జిల్లాకు మెడికల్ కళాశాలలు, నవోదయ కళాశాలలు ఇవ్వకపోయినప్పటికీ.. తమ ప్రభుత్వం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వేర్వేరుగా మెడికల్ కాలేజీలను ఇచ్చామని ఆయన గుర్తు చేశారు.

రంజిత్‌రెడ్డి ఏమైనా పొద్దుతిరుగుడు పువ్వా..!

రంజిత్‌రెడ్డికి ఏం తక్కువ చేశాం.. ఎందుకు పార్టీ మారాల్సి వచ్చింది.. నేను చెబితేనే మీరు ఓట్లేసి గెలిపించారు.. ఆయనేమి పొద్దుతిరుగుడు పువ్వా..? అధికారం ఎక్కడ ఉంటే.. అక్కడ తిరగటానికి అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. రంజిత్‌రెడ్డి ఏ కారణం చేత కాంగ్రెస్‌లోకి వెళ్లాడు... అధికారం కోసమా? వ్యాపారం కోసమా అని ఆయన ప్రశ్నించారు. రంజిత్ రెడ్డికి చేవెళ్ల గడ్డ ప్రజలు దీటైన దెబ్బ కొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వచ్చాక ఉమ్మడిరంగారెడ్డి జిల్లాలో భూములు ధరలు అమాంతంగా పెరిగాయని, లక్షల మందికి యువతకు ఉపాధి లభించిందని కేసీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ సర్వనాశనం అయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యేలు ఆరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు సురభివాణీ దేవి, ఎగ్గె మల్లేశం, దయానంద గుప్తా, శంభీపూర్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్వర్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్, రసమయి బాలకిషన్, టీఎస్ఐఐసీ మాజీ చైర్మన్ బాలమల్లు, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, పార్టీ నేతలు కాసాని వీరేష్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టెప్పులేసిన ఎమ్మెల్యే 'కాలె'

ప్రజాగాయకుడు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సభలో తన ఆట, పాటలతో సభికులను హోరెత్తించారు. 'గులాబీల జెండలమ్మ' అనే పాటకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్టెప్పులేశారు. మాజీ మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, మెతుకు ఆనంద్ పార్టీ కండువాలను ఊపితూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.



సభకు వస్తున్న జనం

చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగరవేస్తాం: సబితా ఇంద్రారెడ్డి



చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగరవేస్తామని మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించే బాధ్యత చేవెళ్ల ప్రజపైనే ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలంతా లోక్‌సభ ఎన్నికల్లో జోష్‌తో పనిచేయాలని సూచించారు.

ఒక్కసారి అవకాశమివ్వండి : ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్



ఉమ్మడి జిల్లా ప్రజలకు నేను ఎన్నో సేవలు అందించాను. ఉమ్మడి రాష్ట్రంలో 93 బీసీ కులాలలను ఏక తాటిపైకి తీసుకు వచ్చానని, తనకు ఎంపీగా ఒక్కసారి అవకాశమిచ్చి ఆశీర్వదించాలని అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో జడ్పీ చెర్మన్‌గా, ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉందన్నారు.

రాష్ట్రానికి దశ దిశ చూపించిన నేత కేసీఆర్ : కాలె యాదయ్య



రాష్ట్రానికి దశదిశ చూపించిన నేత కేసీఆర్ అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి రైతులు, పేదలు, అన్నివర్గాల ప్రజలకు చేయూతనిచ్చారని కొనియాడారు. చేవెళ్ల నియోజకర్గంలోని ఈసీ, మూసీ నదులపై 10 బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు అందించినట్లు చెప్పారు. 84 గ్రామాలకు గుదిబండగా ఉన్న జీవో 111 ఎత్తేయడం జరిగిందన్నారు.

ఉమ్మడి జిల్లాకు దరిద్రం వదిలింది : పైలట్ రోహిత్‌రెడ్డి



పట్నం కుటుంబం బీఆర్ఎస్ పార్టీ వీడటంతో ఉమ్మడి రంగారెడ్డికి దరిద్రం వదిలిందని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల సీటు ఆశపడ్డ వారికి మల్కాజిగిరి సీటు దక్కిందని, అక్కడ నుంచి ఆటే ఇంటికే పోతారని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థి కొండా'ను గెలిపిస్తే.. చిక్కడు దొరకడని, ఆయనే ఎవరినే గుర్తుపట్టడని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, మెతుకు ఆనంద్, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి వెళ్లిన వాళ్లే ఇటు కాంగ్రెస్ అటు బీజేపీలకు అభ్యర్థులుగా ఉన్నారని, ఒక్క లీడర్ పోతే వంద మంది లీడర్లను తయారు చేసే సత్తా కేసీఆర్‌కు ఉందన్నారు. శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, చేవెళ్ల మాజీఎంపీపీ బాల్‌రాజ్, జడ్పీటీసీలు అవినాష్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



శ్రీరామ నవమి ఉత్సవాలకు

మైసిగండి రామాలయం ముస్తాబు

» 16 నుంచి బ్రహ్మోత్సవాలు
» మూడు రోజుల పాటు శ్రీ కోదండ రామచంద్రస్వామి ఉత్సవాలు
» 17న శ్రీ సీతారాముల పరిణయోత్సవం.. రథోత్సవం

కడ్తాల్, ఏప్రిల్ 13 : ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ ఖ్యాతిగాంచిన కడ్తాల మండలం మైసిగండి రామాలయం శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. రాష్ట్రంలో భద్రాచలం తర్వాత ప్రభుత్వ లాంఛనాలతో మైసిగండి రామాలయంలో సీతారాముల పరిణయోత్సవాన్ని నిర్వహిస్తారు. ఏటా శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు మైసిగండి రామాలయాన్ని ముస్తాబు చేశారు. 3 రోజుల బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, నల్గొండ తదితర జిల్లాల నుంచీ భక్తులు తరలి రానున్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగి అక్కన్న, మాదన్నల కాలం నుంచి మైసిగండి శివ, రామాలయం ప్రసిద్ధిగాంచింది. హైదరాబాద్‌కు 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. పురాతన ఆలయాన్ని దివంగత ఆలయ ఫౌండర్ ట్రస్టీ రమావత్ పంతూ నాయక్, దాతలు, ప్రభుత్వం ప్రోత్సాహంతో పునరుద్ధరించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ప్రస్తుతం ఫౌండర్ ట్రస్టీగా రమావత్ పంతూ సతీమణి సిరోలి పంతూ కొనసాగుతున్నారు. ఇదిలా ఉంటే ఆలయ శిల్పకళ అందరినీ ఆకర్షిస్తోంది. ఆలయ ముందు భాగంలోని కోనేటిలో స్నానాలు ఆచరిస్తే పాపాలు, రోగాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. ఈ కోనేరును రూ.కోటితో పునరుద్ధరించారు.

భక్తుల కోసం భారీ ఏర్పాట్లు

మైసిగండి రామాలయం వద్ద శ్రీరామ నవమి ఉత్సవాలకు నిర్వాహకులు, ఎండోమెంట్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరిస్తున్నారు. దైవ దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్‌ల నుంచి మైసిగండికి ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు నడపనున్నారు. మైసిగండి ఆలయంలో ప్రభుత్వ లాంఛనాలతో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తారు. కల్యాణం రోజు ప్రభుత్వం ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారు. 16న విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహనం, 17న శ్రీరామ నవమి సందర్భంగా మధ్యాహ్నం 12:30గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం, సాయంత్రం రథోత్సవం, 18న చక్రతీర్థం, పుష్కర స్నానం కార్యక్రమాలుంటాయని ట్రస్టీ సిరోలి, ఈవో స్నేహలత వివరించారు.



శ్రీ సీతారామచంద్రస్వామి మూల విరాట్టు

నాలుగు మండలాలకు ఒకే ఒక్కడు



» ఇన్‌చార్జి ఎంఈవోకు తలకు మించిన బాధ్యతలు
» శంషాబాద్‌లో ఉద్యోగం.. నాలుగు మండలాల్లో విధులు!
» నెలలుగా సమస్య తీర్చని విద్యా శాఖ అధికారులు

కొందుర్గు, ఏప్రిల్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన, వసతులు కల్పిస్తున్నాం అని తరచూ ప్రజాప్రతినిధులు, నాయకులు అంటుంటారు. కానీ ఆ పాఠశాలలను, ఉపాధ్యాయులను పర్యవేక్షించే ఎంఈవో పోస్టులను మాత్ర భర్తీ చేయడం లేదు. చాలా మండలాలకు ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. ఒక్కో ఎంఈవోకు నాలుగు మండలాల బాధ్యతలు అప్పగిస్తున్నారు. 2015 జూన్ నుంచి కొందుర్గు ఎంఈవోగా కొనసాగిన విద్యాసాగర్ రిటైర్ అవడంతో, మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల హెచ్ఎం భానుప్రకాష్‌రెడ్డికి ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతలను అప్పగించారు. అయితే సీనియర్ హెచ్ఎంకే ఇన్‌చార్జి ఎంఈవో ఇవ్వాలని, చౌదరిగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిష్టారెడ్డికి ఉమ్మడి మండల ఇన్చార్జి ఎంఈవోగా 2015 సెప్టెంబరులో బాధ్యతలిచ్చారు. ఆయన 2015 అక్టోబరులో ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. కాగా హెచ్ఎం కిష్టారెడ్డి 2023 జనవరి 23న శంషాబాద్‌కు బదిలీ కాగా ఆ పాఠశాలకు వారంలో రెండు, మూడు రోజులు వెళ్లి మిగిలిన రోజుల్లో నాలుగు మండలాల ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతలను చూసుకుంటున్నారు. 2016లో ఏర్పాటైన జిల్లేడు చౌదరిగూడ మండల ఎంఈవో బాధ్యతలు సైతం కొందుర్గు ఇన్‌ఛార్జి ఎంఈవో కిష్టారెడ్డికి అప్పగించారు. దీంతో రెండు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా కిష్టారెడ్డి కొనసాగుతున్నారు. కాగా కొత్తూరు ఇన్‌ఛార్జి ఎంఈవో ఇమ్ముల్‌నర్వ హెచ్ఎం కృష్ణయ్య ఫారిన్ సర్వీస్ కోసం వెళ్లడంతో, 2021 సెప్టెంబరులో కొత్తూర్, నందిగామ మండలాలకు సైతం కిష్టారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన నాలుగు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా ఉంటూ విధుల భారంతో సతమతం అవుతున్నారు.

అవసరం ఉన్న మండలానికి వెళ్తున్నా



నాలుగు మండలాల్లో ఏ మండలంలో పనులుంటే ఆ మండలానికి వెళ్తున్నా. ఆ మండలంలో పనులు పూర్తి అయ్యాక మరో మండలానికి వెళ్తున్నా. రోజూ రెండు లేదా మూడు మండలాలకు వెళ్లి పాఠశాలలను పర్యవేక్షిస్తున్నా. నేను ఒక్కడినే ఇన్ని మండలాలు చూసుకోవడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం మండలానికో ఎంఈవోను నియమించాలి.

- కిష్టారెడ్డి, ఇన్‌చార్జి ఎంఈవో, కొందుర్గు

నాలుగు మండలాల పర్యవేక్షణ ఎలా?

కొందుర్గు మండలంలో ఉన్న 33 పాఠశాలల్లో 113 మంది ఉపాధ్యాయులు, 2,759 మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లేడ్-చౌదరిగూడ మండలం 39 పాఠశాలల్లో 127 మంది ఉపాధ్యాయులు, 3,251 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొత్తూరు మండలం 33 పాఠశాలల్లో 140 మంది ఉపాధ్యాయులు, 3,416 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నందిగామ మండల 36 పాఠశాలల్లో 132 మంది ఉపాధ్యాయులున్నారు. 3113మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నాలుగు మండలాల్లో 12,539 మంది విద్యార్థులున్నారు. 141 పాఠశాలలు, 512 మంది ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఒక్క ఎంఈవోతో సాధ్యం కావడం లేదు. దీంతో ఒక్కో మండలంలో రెండు క్లస్టర్ పాఠశాలలను ఏర్పాటు చేసి, ఆయా హెచ్ఎంలకు బాధ్యతలిచ్చారు. మిగితా పనులు ఎంఈవో చూసుకుంటున్నారు. ఒకే రోజు రెండు మండలాల్లో ఎంఈవో అవసరముంటే, రెండు మండలాలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారుల సమావేశాలకు హాజరుకావాలన్నా నాలుగు మండలాల సమాచారం సేకరణ సాధ్యం కావడం లేదు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మిగతా మండలాల బాధ్యతలు తప్పించి ఒక్క కొందుర్గు మండలానికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని ఉపాధ్యాయులు, ప్రజలు కోరుతున్నారు.

వర్షం, గాలులతో నిలిచిన విద్యుత్ సరఫరా

» అంధకారంలో పలు గ్రామాలు

కొందుర్గు, ఏప్రిల్ 13 : మండల పరిధి విశ్వనాథ్‌పూర్, చెర్కుపల్లి, గంగన్నగూడ గ్రామాల ప్రజలు శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 9గంటల వరకు కరెంట్ లేక ఇబ్బందులు పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో జల్లులు కురిశాయి. దీంతో అర్ధరాత్రి సమయంలో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం తగ్గినా, విద్యుత్ సరఫరా కాక ఈ మూడు గ్రామాల ప్రజలు ఉక్కపోతను భరించలేక జాగారం చేశారు. విశ్వనాథ్‌పూర్‌లోని పాత ఎస్సీ కాలనీకి ఆగిర్యాల సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ఉండడంతో, ఆ కాలనీలోని 50ఇళ్లలో కరెంటు ఉంది. కానీ మిగితా 265 ఇళ్లలో అంధకారం నెలకొంది. ఆగిర్యాల సబ్‌స్టేషన్ ద్వారానే తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా, శుక్రవారం అర్ధరాత్రి వర్షానికి కొందుర్గు సబ్‌స్టేషన్ నుంచి గంగన్నగూడ ఫీడర్ విద్యుత్ తీగలపై కొబ్బరి మట్టలు పడడం, ఈదురు గాలులకు గంగన్నగూడెం సమీపంలో విద్యుత్ తీగలు తెగి విద్యుత్ సరఫరా నిలిచిందని, శనివారం ఉదయం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని చెప్పారు.

పౌష్ఠికాహారంతోనే కంటి లోపాల నివారణ

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 13 : పౌష్ఠికాహారం తింటేనే కంటి సమస్యలు రాకుండా, వచ్చిన లోపాలను నివారించుకోవచ్చని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులకు శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దృష్టిలోపం రాకుండా విటమిన్-ఎ ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తినాలన్నారు. క్యారెట్, ఉడికించిన గుడ్లు, ఆకు కూరలు, పాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హేమలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

నేడు బషీరాబాద్‌లో అయ్యప్ప మహా పడిపూజ

బషీరాబాద్, ఏప్రిల్ 13: మండల కేంద్రమైన బషీరాబాద్‌లో ఆదివారం (నేడు) అయ్యప్ప స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని మహాపడి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సాయిలుగౌడ్, పవన్ ఠాగూర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మహాపడి పూజ ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులందరు హజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శామీర్‌పేట అభివృద్ధికి తోడ్పాటునందించాలి

శామీర్‌పేట, ఏప్రిల్ 13: మండల అభివృద్ధికి తోడ్పాటునందించాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మహ్మద్ ముజీబుద్దీన్ సీఎంను కోరాడు. ముజీబుద్దీన్ హైదారాబాద్ నగరంలోని క్యాంప్ కార్యాలయానికి శనివారం వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శామీర్‌పేట మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చాలని ముజీబుద్దీన్ సీఎంను కోరారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ముజీబుద్దీన్

రంజిత్‌రెడ్డిని గెలిపించాలి : స్పీకర్

మోమిన్‌పేట్, ఏప్రిల్ 13: నిత్యం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు రంజిత్‌రెడ్డిని గెలిపించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మోమిన్‌పేట్ మండల బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధిని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. 30 రోజులు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పది సంవత్సరాల పాటు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్‌గౌడ్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి

కందుకూరు : చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జి ఎల్మటి అమరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపనకు ఎంతో దోహదపడుతుందన్నారు. పీసీసీ కమిటీ సభ్యులు ఎస్. మల్లేష్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్, నియోజకవర్గం అధ్యక్షుడు ఎండీ అహ్మద్‌బాయ్, తదితరులున్నారు.

బీజేపీని ఓడించాలి : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్ : రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. మండలంలోని కందనెల్లి సమీపంలో గల జీపీఆర్ గార్డెన్‌లో శనివారం తాండూరు నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టారని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

పేదల కడుపు నింపేది కాంగ్రెస్సే : రంజిత్‌రెడ్డి

పేదల కడుపు నింపేది కాంగ్రెస్ పార్టీయేనని, మతం పేరుతో రెచ్చగొట్టి పబ్బం గడుపుకునేది బీజేపీ అని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. తాను పిలిస్తే పలికే వ్యక్తినని, తనను కలవడానికి ఎవరూ అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదని, తనకు విశ్వేశ్వర్‌రెడ్డితోనే పోటీ అని, ఆయన్ను కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని, అది తీసుకున్నా.. సమయానికి వెళ్లకపోతే.. వారినికూడా కలవరన్నారు. కేవలం స్టేటస్ కోసమే ఎంపీగా గెలవాలని కోరుకుంటున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత, మునిసిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, సొసైటీ చైర్మన్ రవిగౌడ్, నారాయణరెడ్డి, సునీతసంపత్, మండలాధ్యక్షులు గోపాల్, నర్సిములు, రియాజ్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.



మోమిన్‌పేట : మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

వికారాబాద్ : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యపడుతుందని రంజిత్‌రెడ్డి అన్నారు. నవాబుపేట మండలం కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మండలంలోని మైతాబ్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి మండలాధ్యక్షుడు వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి, బీబ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకురాలు ప్రభావతి, తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

హైదర్‌నగర్/చందానగర్ : ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో రంజిత్‌రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. విష్ణు, వంశీగౌడ్ పార్టీలో చేరారు. రామకృష్ణగౌడ్ తదితరులున్నారు. అదేవిధంగా రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుటుంబ సభ్యులు, హఫీజ్‌పేట కార్పొరేటర్ పూజిత, టూరిజం డెవలప్‌మెంట్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ చందానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నేడు పరిగిలో భారీ ర్యాలీ

పరిగి : రంజిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా పరిగి నియోజకవర్గంలో నేడు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండలాధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణాధ్యక్షుడు కృష్ణ తెలిపారు. పరిగిలో విలేకరులతో మాట్లాడుతూ పూడూరు మండలం రాకంచర్ల నుంచి పరిగి వరకు ర్యాలీ ఉంటుందని, పరిగిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తారని తెలిపారు.



పెద్దేముల్ : మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

కీసర రూరల్, ఏప్రిల్ 13: నాగారం మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో నాగారం మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ స్వప్న, కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుర్వి శ్రీనివాస్, అన్నంరాజ్ సుమిత్ర, కో-ఆప్షన్ సభ్యుడు ఆదం షఫీ, సింగిల్‌విండో డైరెక్టర్ భూపాల్‌రెడ్డి, దమ్మాయిగూడ మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ పాండాల అనురాధ యాదగిరిగౌడ్ దంపతులు పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు. వీరంతా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే కావటంతో ఆ పార్టీకి భారీ గండి పడింది. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరింత మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఇటీవలే బీజేపీలో చేరగా, పాలకవర్గానికి చెందిన వారు ఇతర పార్టీల్లో చేరుతుండటంతో నాగారంలో బీఆర్ఎస్ పార్టీ బలహీనంగా మారుతోంది. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ పంగ హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల్ల కుమార్, నాయకులు పొట్ట శ్రీశైలం, సతీష్ గౌడ్, కొండల్‌రెడ్డి, సత్యంసాగర్ పాల్గొన్నారు.



మాజీ ఎంపీపీ స్వప్న, ఆమె భర్త, కౌన్సిలర్ వెంకట్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ

కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీలు

మేడ్చల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ సమన్వయ కమిటీలను నియమించినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కమిటీలు మే 13న లోకసభ ఎన్నికలు ముగిసేంత వరకు పనిచేస్తాయన్నారు. మేడ్చల్ కమిటీలో వజ్రేష్‌యాదవ్, శరత్‌చంద్రారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, మహ్మద్ ముజీబుద్దీన్, పి.అమరేందర్‌రెడ్డి, పి.హరిబాబు, ఉప్పల్‌కు ఎం.పరమేశ్వర్‌రెడ్డి, స్వర్ణరాజశివమణి, రజితారెడ్డి, బి.శ్రీదేవి, జలీల్‌పాషా, గడ్డం యాదగిరి, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంకు మైనంపల్లి హన్మంతరావు, రాజ జితేంద్రనాథ్, ఎస్.అశోక్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, టి.లక్ష్మీకాంత్‌రెడ్డి, కంటోన్మెంట్‌కు వెన్నెల, అమరేందర్‌రెడ్డి, రాజు, యాదగిరి, బాబురావు, వెంకటేశ్, కూకట్‌పల్లికి బండి రమేష్, సత్యం శ్రీరంగం, పి.నాగిరెడ్డి, టి.వేణు, పి.విఠల్‌రెడ్డి, పుష్పరెడ్డి, సంధ్యారాణి, రాజేందర్, బషీర్‌భాయ్‌లతో సమన్వయ కమిటీలను నియమించినట్లు పేర్కొన్నారు.

రూ.లక్షా 50వేల నగదు స్వాధీనం

దౌల్తాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఈక్రమంలో వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటకలోని యాద్గీర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కేఏ 33 యం 9931 నెంబరు గల కారును తనిఖీ చేయగా రూ.లక్షా 50వేలు పట్టుబడ్డాయి. దాంతో డబ్బును సీజ్ చేసినట్లు దౌల్తాబాద్ ఎస్సై శ్రీశైలం యాదవ్ తెలిపారు.



నగదును చూపిస్తున్న ఎస్సై శ్రీశైలం

బెల్టుషాపులకు ఎన్నికల కోడ్ వర్తించదా?

కులకచర్ల, ఏప్రిల్ 13: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలకు ఎన్నికల కోడ్ వర్తించదా? అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరపరాదని సంబంధిత అధికారులు దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బెల్టు షాపుల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్నా అధికారులకు కనిపించడం లేదా? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం కులకచర్లలో వైన్ దుకాణాలు రాత్రి 10గంటల వరకు మూతపడుతున్నా బెల్టుషాపులు మాత్రం అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయి. రోడ్డు పక్కన దుకాణాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగించడంతో ఆ దారిలో వెళ్లేందుకు వాహనదారులు, మహిళలు భయాందోళన చెందుతున్నారు. మూడు రోజుల కిందట ప్రత్యేక బృందాలు కులకచర్లలో బెల్టుషాపులపై దాడిచేశారు. మద్యం లభించినా ఏ చర్యలు తీసుకోకుండా వదిలిపెట్టడం గమనార్హం. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో బెల్టు షాపులపై సంబంధిత అధికారులు దాడులు నిర్వహిస్తూ నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో కొందరు బెల్టు షాపుల నిర్వాహకులు దర్జాగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులు బహిరంగంగా మద్యం విక్రయాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బెల్టుషాపులపై నామమాత్రపు దాడులు చేసి నిర్వాహకులను వదిలిపెట్టడం సరైన పద్ధతికాదని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విరాసత్ కోసం ఆరు నెలలుగా నిరీక్షణ

- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతు
- రెండుసార్లు మీ-సేవలో విరాసత్‌కు దరఖాస్తు
- రెవెన్యూ అధికారులపై అవినీతి ఆరోపణలు!
- కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు

తాండూరు రూరల్, ఏప్రిల్ 13: రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి ఓ రైతు అలిసిపోయాడు. ఆరు నెలల క్రితం విరాసత్ కోసం దరఖాస్తు చేసినప్పటికీ పెండింగ్‌లో ఉంది. దాంతో ఆ రైతు ప్రతీరోజు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన పెంటగుంతల చంద్రప్పకు తన తండ్రి పెంటప్ప పేరున ఉన్న 6ఎకరాల 4గుంటల భూమి ఉంది. పెంటప్పకు ముగ్గురు కుమారులు. ఇందులో ఇద్దరు మృతిచెందారు. అయితే, కుమారులు చనిపోవడంతో ఒక కుమారుడు, ఇద్దరు కోడళ్ల పేరుమీద భూమి వారసత్వంగా పట్టా చేయాల్సి ఉంది. ఇందుకోసం చంద్రప్ప 2023 అక్టోబర్ 13న రూ.16వేలు మీ-సేవలో చెల్లించి విరాసత్‌కు తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. దాంతో మళ్లీ అక్టోబర్ 23న మరో రూ.16వేలు చెల్లించినా ఫలితం లేకపోయిందని రైతు చంద్రప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. అన్నిరకాల సర్టిఫికెట్లు ఉండి ఆరునెలల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా విరాసత్ కావడం లేదని వాపోతున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని రైతు వేడుకుంటున్నాడు.



విరాసత్ పేపర్లు చూపిస్తున్న రైతు పెంటగుంతల చంద్రప్ప

అధికారులపై అవినీతి అక్రమాల ఆరోపణలు

తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని కార్యాలయాలకు వెళ్లే ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల ధరణిలో అధికారులు అవినీతి ఆరోపణల మూలంగానే వారిని బాధ్యతల నుంచి తప్పించి రిజిస్ట్రేషన్ అథారిటీని తహసీల్దార్ తారాసింగ్‌కు అప్పగించినట్లు తెలిసింది. ధరణి ఆపరేటర్‌ను సైతం మార్చినట్లు సమాచారం. రెవెన్యూ జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపితే తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి బండారం బయటపడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కలెక్టర్ రెవెన్యూ అధికారులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్నది వాస్తవమే

బిజ్వార్‌కు చెందిన రైతు చంద్రప్ప విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్న విషయం వాస్తవమే. క్షేత్రస్థాయిలో వెళ్లి పంచనామా పూర్తి చేశాం. లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తి నివేదికను పంపిస్తాం. ప్రతీ రైతుకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తాం. చంద్రప్ప సమస్య తెలుసుకొని అతడికి అన్నివిధాలా న్యాయం చేస్తాం.

\- బాల్‌రాజ్, తాండూరు ఆర్ఐ

బీజేపీది మత రాజకీయం

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి ఏప్రిల్ 13 : అధికారాన్ని కాపాడుకోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు సాగిస్తూ దేశంలో విద్వేషాలను రెచ్చగొడుతోందని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి ఆరోపించారు. పదేళ్ల బీజేపీ పాలనలో కార్పొరేట్ సంస్థలకు మేలు జరిగిందే తప్పా.. పేదలకు ఒరగబడిందేమీ లేదని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాల్లో రోడ్ షో నిర్వహించారు. ఆయా చోట్ల జరిగిన రోడ్ షోలో మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సతీష్ మాదిగ, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, లోక్‌సభ ఎన్నికల కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఇందిరా శోభన్‌లు పాల్గొన్నారు. ర్యాలీలు, రోడ్ షోలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మల్లు రవి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టాలు తప్పిందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి సమాధి తప్పదన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ స్కామ్‌లు, స్కీంల పేరుతో దేశాన్ని లూటీ చేశారని, ఓటుద్వారా ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. కసిరెడ్డి మాట్లాడుతూ మల్లు రవికి కల్వకుర్తి నియోజకవర్గంలో 50 వేల మెజార్టీ ఇచ్చేలా పార్టీ శ్రేణులంతా సైనికుల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు కమ్లీమోత్యా నాయక్, అనితా విజయ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బీక్యానాయక్, అంజయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గౌడ్, భగవాన్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో మాట్లాడుతున్న మల్లు రవి

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు : డీఎస్పీ

వికారాబాద్/కొడంగల్, ఏప్రిల్ 13: నేటి నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారులు శనివారం డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను వికారాబాద్‌లో ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వారంరోజుల పాటు ప్రధాన కూడళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అధికారి వెంకట రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖ కొడంగల్ అధికారి ప్రభాకర్ కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి చేతులమీదుగా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిబ్బంది మతీన్, ఆనంద్, భీమ్‌రెడ్డి, మోతిలాల్, భానుప్రసాద్, వెంకటప్ప పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు

- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 13 : ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగి పోయారని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థికి ఓట్లు అడిగే నైతిక హక్కులేదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్ర శనివారం ఉదయం మండలంలోని చిప్పలపల్లి, ధన్నారం, పులిమామిడి, బాచుపల్లి, నేదునూరు, దాసర్లపల్లి, ముచ్చర్ల, ఊట్లపల్లి, సార్లరావులపల్లి, మీర్ఖాన్‌పేట, ఆకులమైలారం గ్రామామీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా గుమ్మడవెల్లిలో బహిరంగ సభ నిర్వహించారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌తో కలిసి మాట్లాడారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల రాష్ట్రంగా మార్చాయన్నారు. కేంద్రం అమలు చేసిన ఫసల్‌బీమా, ఆవాజ్ యోజన వంటి పథకాలను రాష్ట్రంలో అమలు కాకుండా బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. కాగా, 24 రోజులపాటు కొనసాగిన ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా 13 కిలోమీటర్ల మేర తిరిగి.. 380 గ్రామాలను పర్యటించి రైతులు, ప్రజలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించినట్లు కొండా తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకున్నా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ.9వేల కోట్ల నిధులను మంజూరు చేసినట్లు విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే ఈ ఎన్నికల్లో తన విజయానికి శ్రీరామ రక్షగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, యాత్ర ఇన్‌చార్జి ఎస్.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములయాదవ్, పాపయ్య గౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి, పార్టీ మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు అంజిరెడ్డి, మహేందర్, ఎంపీటీసీ మల్లేష్, మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, గౌర ప్రభాకర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : నేదునూరులో మాట్లాడుతున్న కొండా

కొండా గెలుపునకు కృషి

రాజేంద్రనగర్ : కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి కార్యకర్తలు సైనికుల వలే పనిచేస్తున్నామని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి నవారు మురళీధర్‌రెడ్డి అన్నారు. నాయకులు రామిడి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరంలో విశ్వేశ్వర్‌రెడ్డికి పార్టీ ఎల్ఈడీ గుర్తును బహూకరించారు. మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై కొండా విశ్వేశ్వర్ రెడ్డి కుటుంబం ముద్ర బలంగా ఉందన్నారు. నిజాయితీగల నాయకునిగా కొండాకు పేరుందన్నారు. చేవెళ్ల నుంచి విశ్వేశ్వర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అడికె జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సేవచేసే నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదర్‌నగర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసే నాయకుడు కొండా విశ్వేశ్వరరెడ్డి అని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. హైదర్‌నగర్ భాగ్యనగర్, హెచ్ఎంటీ శాతవాహన, హెచ్ఎంటీహిల్స్, నాగార్జునహోమ్స్, నిజాంపేటరోడ్, అల్లాపూర్ సొసైటీ కాలనీల్లో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



హైదర్‌గూడ : ఇంటింటి ప్రచారంలో రవికుమార్

మహనీయుల విగ్రహాల ముసుగు తొలగేదెన్నడో?



ముసుగు వేసి ఉన్న అంబేడ్కర్, పూలే విగ్రహాలు

చౌదరిగూడ, ఏప్రిల్ 13 : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మజ్యోతిరావు పూలే విగ్రహాలను జిల్లేడ్ చౌదరి గూడ మండల కేంద్రంలోని పద్మారం మూలమలుపు వద్ద ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ఆవిష్కరణకు మాత్రం నోచుకోవడం లేదు. దీంతో ఆ విగ్రహాలు నెలల తరబడి ముసుగుతోనే ఉంటున్నాయి. నేడు అంబేడ్కర్ జయంతి సందర్భంగా కూడా అలాగే ఉండబోతున్నాయి. అంబేడ్కర్, మహాత్మాజ్యోతీరావు పూలే విగ్రహాల ఏర్పాటు కోసం పలువురు నాయకులు సంవత్సరం క్రితం దిమ్మె నిర్మాణం చేశారు. అంతలోనే శాసనసభ ఎన్నికల కోడ్ రావడంతో విగ్రహాలను దిమ్మెపై పెట్టి ముసుగు కప్పారు. నేటికి వాటిని ఆవిష్కరించకపోవడంతో ఇప్పటికీ ముసుగుతోనే ఉన్నాయి. ప్రజలను చైతన్య పరిచిన మహోన్నత వ్యక్తుల విగ్రహాలు అవిష్కరణకు నోచుకోలేక పోతున్నాయని, ముసుగు తొలిగేదెన్నడోనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు స్పందించి ఆ మహనీయుల విగ్రహాలకు ముసుగు తొలగించాలని కోరుతున్నారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు



పోస్టర్ విడుదల చేస్తున్న ఫైర్ అధికారులు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 13 : అగ్ని ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఎఫ్ఓ రాజు, ఎస్ఎఫ్ఓ జగన్ సూచించారు. శనివారం షాద్‌నగర్ ఫైర్ స్టేషన్ ఆవరణలో అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబాయి విక్టోరియా డాక్యార్డ్‌లో ఓ నౌకకు అగ్ని ప్రమాదం జరిగి 66 మంది నౌకాదళ సిబ్బంది మృతి చెందారని, వారి జ్ఞాపకార్థం అగ్ని మాపక వారోత్సవాలు జరుపుకుంటున్నామని అన్నారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయడం వారోత్సవాల ముఖ్యఉద్దేశమని చెప్పారు. ఆపత్కర పరిస్థితుల్లో సేవలందించేందుకు తాము సిద్ధంగా ఉంటామని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ధైర్యం కోల్పోకుండా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రజల కోసం నిర్మాణాత్మక పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13 : ప్రజల కోసం సీపీఎం నిర్మాణాత్మక పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. మనువాదం పేరిట కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించి ఓట్లు రాబట్టుకునే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇబ్రహీంపట్నంలో శనివారం జరిగిన సీపీఎం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ నెల 19న సీపీఎం ఎంపీ అభ్యర్థిగా తాను భువనగిరిలో నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు జంగారెడ్డి, జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, యాదయ్య, సామేల్, మండల కార్యదర్శి జంగయ్య, ఎల్లేష్ పాల్గొన్నారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

షాద్‌నగర్, ఏప్రిల్ 13 : అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నేడు నిర్వహించే రాజ్యాంగ పరిరక్షణ చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ పిన పాక ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళిత, గిరిజనులను దేశ ద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం పరివార్ శక్తులు కుట్ర పన్నుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలి

● వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వక్తలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 13 : ప్రతి వ్యక్తి దైవభక్తి కలిగిఉండాలని, దైవభక్తితోనే సమాజంలో శాంతి నెలకొంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాష్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే చల్లాధర్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ అన్నారు. శనివారం శంషాబాద్ మండలంలోని నర్కుడ అమ్మపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి ప్రథమ వార్షికోత్సవంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వారు స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తన్విరాజ్, శంషాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, మాజీ సర్పంచ్ సిద్దులు, నాయకులు కొలన్ మహేందర్‌రెడ్డి, గణేష్‌గుప్త, కుమార్‌యాదవ్, మల్లేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో భక్తులు



ఆంజనేయ స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

ఆలయాల అభివృద్ధికి సహకారం..

ఆమనగల్లు/మాడ్గుల : ఆలయాల అభివృద్ధి, దైవ కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో శనివారం పర్యటించి పకీర్‌తండా గ్రామ పంచాయితీలోని బాలు తండాలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తండా గిరిజనులు , ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించి అబినందించారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని ఆయన తెలిపారు. జయరామ్ తండాలో ఫౌండేషన్ ద్వారా గతంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తండా నాయకులు రూపదేవిలాల్, దావు, చంద్రు, లక్ష్మణ్, అమర్‌నాయక్, అమర్ సింగ్, రాందాస్, దేవిలాల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప మహాపడి పూజ

ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్ప కొండపై గల శ్రీ హరిహరపుత్ర దేవాలయంలో ఆదివారం నిర్వహించబోయే వేడుకలకు ఆలయ నిర్వాహకుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. జయంతి వేడుకల్లో భాగంగా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపకులు రాజు దేశ్‌పాండే గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

కడ్తాల్ : మండల పరిధి అన్మాస్‌పల్లిలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, ప్రత్యేక పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజలు కొనసాగాయి. ఆలయ నిర్వాహకురాలు లీలాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని ఆమె సూచించారు.

త్వరలో బీసీ 'ఏ' జాబితాలోకి ముదిరాజ్‌లు

●ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఏప్రిల్ 13 : శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లకు బీసీ 'డీ' జాబితా నుంచి 'ఏ'లోకి మార్చే అవకాశం ఉన్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని ప్రకటిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో ముదిరాజ్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజ్‌ల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ముదిరాజ్ భవనం, పెద్దమ్మతల్లి మందిర నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ముదిరాజ్ నాయకులు అంచరాములు, తుమ్మల గోపాల్, అందె మోహన్, మంగ మధు, భైరమోని సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీర్లపల్లి

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

సమాజంలో ప్రతీ ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకొని పేద ప్రజలకు సేవ చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని 27వ వార్డులో కాంగ్రెస్ పార్టీ యువనేత మంగ మధు ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం, చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు బాలరాజుగౌడ్, అగ్గనూరు విశ్వం, చెన్నయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు గుణపాఠం చెప్పాలి

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, ఏప్రిల్ 13 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం రాత్రి జరిగిన రోడ్‌షో అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ.-82 కాల్వ పనులు ఆగస్టు నాటికి పూర్తి చేసి ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల, మండలాల పరిధిలోని 35 వేల ఎ కరాలకు సాగు నీరు అందిస్తామని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగు నీరందించి రైతులను ఆదుకుంటామన్నారు. త్వరలో ప్రభుత్వ జూనియర్‌కళాశాల భవనం పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. మున్సిపాల్టీని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహ, రవీందర్‌నాయక్, తదితరులున్నారు.

పీఏసీఎస్ మాజీ చైర్మన్‌కు నివాళి

మాడ్గుల పీఏసీఎస్ మాజీ చైర్మన్, మాజీ ఎంపీటీసీ బొజ్జమోహన్‌రెడ్డి(69) శనివారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణ రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి, మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్ దాస్, మాజీ ఎమ్మెల్యే పల్లం వెంకట్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, కార్యదర్శి సూదిని రాంరెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్‌లు భట్టుకిషన్‌రెడ్డి, నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు నివాళులర్పించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

లక్ష్మారెడ్డిపై సీఎంకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

కందుకూరు, ఏప్రిల్ 13 : కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిపై ఆ పార్టీ నేతలు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. లోక్‌సభ ఎన్నికలకు స్థానిక నేతలే ఇన్‌చార్జులుగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి ఆదేశించినా లక్ష్మారెడ్డి దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ కృష్ణానాయక్, వివిధ గ్రామాల బూత్ కమిటీల ఇన్‌చార్జిలతో కలిసి సీఎంకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏనుగు జంగారెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజలు, ఓటర్ల మనోభావాలు స్థానిక నేతలకే తెలుస్తాయని, కానీ తమను ఆర్కెపురంలో పనిచేయడానికి ఇన్‌చార్జిలుగా నియమించడంపై సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయంపై సీఎం స్పందించి ఈ ఎన్నికల్లో ఎక్కడి వారు అక్కడే పనిచేసి చేవేళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బుక్క ప్రశాంతిపాండురంగారెడ్డి, మండల కో-ఆప్షన్ మెంబర్ ఎండి సులేమాన్, ప్యాక్స్ డైరక్టర్ తీగల జగదీశ్వర్‌రెడ్డి, దెబ్బడగూడ, సాయిరెడ్డిగూడ, మీర్కాన్‌పేట గ్రామాల మాజీ సర్పంచ్‌లు ఏనుగు శ్రావణి, మహేష్, నర్సింహ్మా, మాజీ ఎంపీటీసీ నర్సింహ, నాయకులు వెంకటేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగారెడ్డి

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ నేతలు



ప్రజా ఆశీర్వాద సభకు వెళుతున్న నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 13 : చేవెళ్లలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద యాత్ర ముగింపు సభకు మండలంలోని ఆ పార్టీ నాయకులు శనివారం తరలివెల్లారు. పట్టణ కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్, ఏఎంసీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ జెండాను ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మినర్సింహరెడ్డి, అనేగౌని అంజయ్యగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్, కాకి రాములు, లలితాకుమార్, ఇందిరదేవేందర్, నాయకులు దశరథ్, కార్తీక్, తదితరులున్నారు.

అక్షరమే గొప్ప ఆయుధం



అక్షరాభ్యాసం చేయిస్తున్న జ్ఞాన ప్రసూనశర్మ

కడ్తాల్, ఏప్రిల్ 13 : అసమానతలను రూపు మాపడానికి, అంతరాలను తొలగించడానికి అక్షరమే గొప్ప ఆయుధమని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్మన్ లీలాలక్ష్మారెడ్డి, ప్రముఖ కవి జ్ఞాన ప్రసూన శర్మ అన్నారు. మండలంలోని అన్మాస్‌పల్లిలో గల శ్రీ వీరాంజనేయ క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి మాత మందిరంలో శనివారం అక్షరాభ్యాసం కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారై సరస్వతి దేవి కి పూజల అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు శంకర్, రాజు గౌడ్, పర్వతాలు, కిష్టయ్య, రజనికాంత్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో విశ్వగురుగా భారత్

నందిగామ, ఏప్రిల్ 13 : ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ భారత్ విశ్వగురువుగా ముందుకెళుతోందని బీజేపీ నాయకుడు దేపల్లి అశోక్ గౌడ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యాక్రమాలను వివరిస్తూ మహబూబ్‌నగర్ ఎంపీగా డికె అరుణను గెలిపించాలని శనివారం మండలంలోని మామిడిపల్లిలో దేపల్లి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింలుగౌడ్, రణధీర్‌గౌడ్, శ్రీశైలం, ప్రవీణ్ గౌడ్, సుదాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు, శరత్, వెంకటేష్, ప్రసాద్, క్రిష్ణ మోహన్, మల్లేష్, అశోక్, వెంకటేష్‌గౌడ్, వజ్రం పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

●బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నెబాషయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బాషయ్య

మంచాల, ఏప్రిల్ 13 : ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నెబాషయ్య, నాయకుడు వింజమూరి వెంకట్‌రెడ్డిలు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మంచాలలో జరిగిన బీజేపీ మండల ముఖ్యనేతల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రణాళికా బద్ధంగా ప్రచారం నిర్వహించాలన్నారు. బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మారమోని శ్రీశైలం, జనార్దన్‌రెడ్డి, నారెడ్డి నర్సింహారెడ్డి, కొండల్, నూకం రాజు, గడ్డం రాజేందర్‌రెడ్డి, చివిరాల పాండు, నర్ల రమేష్, కృష్ణ, బండిరాజు, యాటరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలరాజ్‌యాదవ్‌కు వెస్టేజ్ అవార్డు

శంషాబాద్ రూరల్ 13 : బీఈడీ పూర్తి చేసి నిరుద్యోగంతో బాధపడుతున్న బాలరాజ్‌యాద్ అనే వ్యక్తి శుక్రవారం శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్ట్ రోడ్‌లో కన్వెన్షన్ హాల్‌లో వెస్టేజ్‌లో అవార్డు అందుకున్నారు. బషీరాబాద్ మండలంలోని నవాల గ్రామానికి చెందిన బాలరాజ్‌యాదవ్ శంషాబాద్‌లో నివాసముంటున్నాడు. 18 నెలలుగా ఆ సంస్థలో పని చేసుకుంటూ గ్రౌండ్ డైరెక్టర్‌గా అవార్డు అందుకున్నారు. ఓ వైపు ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే వెస్టేజ్‌లో విధులు నిర్వహించి అవార్డు అందుకున్నారు.

రేపు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేశంపేట, ఏప్రిల్ 13 : కేశంపేట మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రేపు(సోమవారం) కేశంపేట మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు డీఆర్‌డీఏ ఏపీఎం భగవంతు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ఏ గ్రేడు ధాన్యానికి రూ. 2203, సాధారణ ధాన్యానికి రూ. 2183 ధర నిర్ణయించినట్లు చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని సూచించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళాలు

షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 13 : షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం దాతలు ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ పి. వెంకట్‌రాంరెడ్డి రూ.21వేలు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ వర్గ సభ్యుడు అందె బాబయ్య రూ.21వేలు, వినాయక డిజిటల్ యజమాని గోరి మల్లేష్‌గౌడ్ రూ.25వేలు, జర్నలిస్టు లక్కాకుల రమేష్ రూ.21వేలు విరాళంగా ఇచ్చారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, బ్రహ్మోత్సవాల కోసం విరాళాలు ఇచ్చినట్టు వారు తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చెస్తూ, ఉత్సవాలను నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు వారు ఈ విరాళాలను అందజేశారు. కార్యక్రమంలో ఒగ్గు కిషోర్, కానుగు రాంభూపాల్, రాయల శంకర్, తోకల దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి , ఏప్రిల్ 13 : ఓ నిరుపేద ఇంటి నిర్మాణానికి తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. కేస్లీ తండాకు చెందిన లక్ష్మణ్ ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆ ఇంటి నిర్మాణం పూర్తి కావడానికి వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెటీరియల్‌ను సమకూర్చారు. శనివారం ట్రస్ట్ సభ్యులు లక్ష్మణ్‌కు మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్, చింటు, శివ, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి , ఏప్రిల్ 13 : మండల పరిధిలోని మాదాయిపల్లి గ్రామానికి చెందిన బాలనాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ. మూడు వేలు సమకూర్చగా స్థానిక నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు పరంజ్యోతి, రామస్వామి, శంకరయ్య, మైసయ్య, యాదయ్య, రమేశ్,వినోద్, నవీన్,శ్రీశైలం, కుమార్, తదితదరులు ఉన్నారు. అదేవిదంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రూ. మూడు వేలు సమకూర్చగా ట్రస్ట్ సభ్యులు అందజేశారు. వారిలో రామస్వామి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో డ్రైవర్ అదృశ్యం

యాచారం, ఏప్రిల్ 13 : అద్దె ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే ఓ ఆటో డ్రైవర్ అదృశ్యమైన ఘటన శనివారం వెలుగు చూసింది. ఆదిభట్ల పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జర్పుల కిష్టు(45) అనే వ్యక్తి బాలాపూర్ మండలంలోని కుర్మల్‌గూడలో నివాసముంటున్నాడు. ఇతను మూడావత్‌రాజు అనే వ్యక్తి వద్ద టీఎస్ 13 యూసి 4945 నెంబర్ గల ప్యాసింజర్ ఆటోను అద్దెకు తీసుకుని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఈనెల 1న ఆటో కోసం ఇంటి నుంచి వెళ్లాడు, ఆ రోజు నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య విజయ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

నకిలీ నగలపై రుణం.. ముగ్గురిపై కేసు

యాచారం, ఏప్రిల్ 13 : నకిలీ నగలను కుదవ పెట్టి రుణం పొంది, మోసం చేసిన ముగ్గురు నిందితులపై యాచారం, ఆదిభట్ల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. తుర్కయాంజాల్‌లోని ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ బిటీడీలో ఆడిట్ చేయగా శ్రీనివాస్ అనే వ్యక్తి నకిలీ బంగారంతో రుణం తీసుకున్నట్లు తేలింది. ఇందులో నకిలీ బంగారు ఆభరణాలు కూడా లభ్యమయ్యాయి.ఫైనాన్స్ వారిని నమ్మించి నిందితులు శ్రీనివాస్ రూ.23.87లక్షలు, గుడిమల్ల మహేష్ రూ.1.64లక్షలు, రహీమ్ పాషా రూ.3.60లక్షలు తీసుకున్నారు. వీరి మోసంపై తమకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం, ఆదిభట్ల పోలీసులు చెప్పారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

యాచారం ఏప్రిల్ 13 : కర్నాటకలోని రాయ్‌చూర్ నుంచి నగర శివారులోని పెద్ద అంబర్‌పేటకు ఉల్లిగడ్డల లోడ్‌తో వస్తున్న ఓ లారీ శుక్రవారం రాత్రి రావిర్యాల సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న స్వామాట్,(31), విటల్(30) అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే చికిత్స కోసం నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

మాజీ వైస్‌ఎంపీపీకి నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

షాబాద్, ఏప్రిల్ 13 : మాజీ వైస్‌ఎంపీపీ మంగలి శివకుమార్(44) శనివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి నివాళులర్పించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శివకుమార్ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున ఆసుపత్రిలో కన్నుమూశారు. షాబాద్‌లో జరిగిన ఆయన అంత్యక్రియల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ, తదితరులు

నందిగామ, ఏప్రిల్ 13 : గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వ ముందుకెళుతుందని నందిగామ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా తాము ముందుకెళుతున్నామని చెప్పారు. శనివారం నందిగామ మండల కేంద్రంలోని 8 వ వార్డులో ఎస్‌ఎఫ్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. మండల కేంద్రంలో మరిన్ని సీసీ రోడ్లు నిర్మించడానికి ప్రణాళికలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు శివకుమార్‌గౌడ్, నర్సింలు, సత్తిపండు, రమేష్, జంగయ్య, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తండ్రిపై కేసు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

యాచారం, ఏప్రిల్ 13 : మైనర్లు వాహనాలు నడిపితే వారి తండ్రిపై కేసులు నమోదు చేస్తామని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, త్రిబుల్ రైడింగ్ చేసినా చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని యాచారం సీఐ శంకర్‌కుమార్ అన్నారు. యాచారంలో శనివారం పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాదారుడు విధిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను పోలీసులకు చూపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనదారుల వద్ద రూ.50వేలకు మించి నగదు ఉంటే తగిన ఆధారాలను పోలీసులకు చూపాలని, లేదంటే ఆ డబ్బును స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తామన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే ఘన విజయం

కడ్తాల్, ఏప్రిల్ 13 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ కడ్తాల మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్, సేవాదల్ మండల అధ్యక్షుడు గురిగళ్ల లక్ష్మయ్య, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ పోతుగంటి శంకర్ అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఈ ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదన్నారు. సమావేశంలో నాయకులు మహేశ్, ఇమ్రాన్‌బాబా, మంకి శ్రీను, శ్రీశైలం, నాగిళ్ల మలమ్మ, తదితరులు ఉన్నారు.